TELANGANA POLITRICKS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
విశాల భారతి
vishalabharathi Telugu Daily
మంగళవారం, 14.11.2023 హైదరాబాద్
1pm edition



# పాలిట్రిక్స్ 2023-2024

పాలిట్రిక్స్



## తెలంగాణకు ఏఐసీసీ టాప్‌క్యాడర్!

**6 రోజుల పాటు ఖర్గే, రాహుల్, ప్రియాంక మకాం**

**రాష్ట్రానికి రెండు హెలికాప్టర్ల కేటాయింపు**

**క్షేత్రస్థాయి నుంచి ఫోకస్‌చేస్తూ ప్రచారం**

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌రేవంత్ రెడ్డి రాష్ట్రంలో రోజుకు మూడు సభల చొప్పున సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని పార్టీ భావిస్తోంది. అందుకే స్థానిక నాయకులతో పాటు ఢిల్లీ నుంచి కూడా హైకమాండ్ హైదరాబాద్‌లో మకాం వేయబోతోంది. నవంబర్లో మొత్తం 60 సభలో వరకు నిర్వహించాలని కాంగ్రెస్ ప్లాన్ చేసింది.

ఎన్నికల ప్రచారాన్ని అన్ని పార్టీలు ముమ్మరం చేశాయి. ఇక ఎన్నికలకు కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో పోటా పోటీ ప్రచార సభలతో అన్ని పార్టీలు ముందుకెళుతున్నాయి. ఎన్నికల ప్రచారం నేపథ్యంలో ఏఐసీసీ టాప్ క్యాడర్ తెలంగాణలో మకాం వేయనుంది. ఈ నెల 17 నుంచి రాహుల్, ప్రియాంకతో పాటు ఇతర ముఖ్య నేతలు తెలంగాణలో ఉండి పలు సభలు నిర్వహించబోతున్నారు. అందుకు అనుగుణంగా ఎన్నికల ప్రచారం కోసం తెలంగాణకి రెండు హెలికాప్టర్లను కేటాయించింది ఏఐసీసీ. ఇప్పటికే ఒక హెలికాప్టర్‌లో రేవంత్ రెడ్డి రోజుకు మూడు సభల చొప్పున తన ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అందుకు అనుగుణంగానే కార్యచరణ రూపొందించబోతోంది. ప్రస్తుతం చత్తీస్‌ఘడ్‌లో ఎన్నికల నేపథ్యంలో అధినాయకత్వం అక్కడ ఉన్నారు. చత్తీస్‌ఘడ్ ఎన్నికలు 17న ముగియనుండడంతో రాహుల్, ప్రియాంక తెలంగాణకి రాబోతున్నట్టుగా తెలుస్తోంది. ఈ నెల 17 నుంచి రాహుల్ హైదరాబాద్‌లో ఉండబోతున్నట్టు సమాచారం. ఇక రాహుల్, ప్రియాంకతో పాటు మల్లికార్జున ఖర్గే తెలంగాణ టూర్ ని షెడ్యూల్ చేస్తున్నారు. సుమారు ఆరు రోజులపాటు ముగ్గురు తెలంగాణలోనే ఉండి పలు సభలు నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారు. ఒకే రోజు వివిధ ప్రాంతాల్లో రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గే సభలు ఉండేలా కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తోంది. ఈ 15 రోజుల్లో సోనియాగాంధీతో మరో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ చూస్తోంది. ఢిల్లీ నుంచి వచ్చిన ఏఐసీసీ టీమ్ ఒకటి తెలంగాణ ఎన్నికలపై ఫోకస్ పెడుతోంది. వివిధ రాష్ట్రాల రాష్ట్రాలలో గతంలో ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పోటీ చేసిన నాయకులు ప్రస్తుతం తెలంగాణ ఎన్నికల పనులపై పనిచేస్తున్నారు. మీడియా, వార్ రూమ్ ఆక్టివిటీ, పబ్లిసిటీ, టూర్ షెడ్యూల్ ఇలా ఒక్కొక్కరు ఒక్కో బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా 119 నియోజకవర్గాల్లో ఏఐసిసి వారు క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని పర్యవేక్షించబోతున్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల పర్యటనలు తెలంగాణలో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే బిసి డిక్లరేషన్ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలంగాణలో పర్యటించారు. సిద్ధరామయ్యతో మరొక టూర్ ని ప్లాన్ చేస్తోంది తెలంగాణ కాంగ్రెస్. ఇప్పటికే కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కీలకంగా వ్యవహరించిన డీకే శివకుమార్ తెలంగాణలో రెండుసార్లు పర్యటించారు.మొదట తాండూర్, పరిగి, చేవెళ్ల కార్నర్ మీటింగ్స్ పాదయాత్రలో పాల్గొన్న డీకే శివకుమార్ తెలంగాణలోని ఆరు గ్యారెంటీలు కర్ణాటకలోని ఆరు గ్యారెంటీలకంటే అద్భుతంగా ఉన్నాయని చెప్పారు. సిద్ధరామయ్యతో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన రోజే డీకే శివకుమార్ కూడా కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇలా వరుస సభలతో ఎన్నికల్లో కాంగ్రెస్ ముందుకు వెళ్తోంది. రాహుల్ ప్రియాంక మల్లికార్జున్ ఖర్గేలకు సంబంధించిన టూర్ షెడ్యూల్ వార్ రూమ్ డిజైన్ చేస్తోంది.

## ఈనెల 16న బీజేపీ మేనిఫెస్టో.. కీలక హామీలు ఇవే..!

**జాబ్‌క్యాలండర్, ఉపాధి అవకాశాలు**

**నవంబర్25, 26, 27 తేదేల్లో మోదీ పర్యటన**

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ స్పీడ్ పెంచింది. ఇప్పటికే ప్రచారంలో బీజేపీ నేతలు దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను ఈనెల 16న విడుదల చేయనుంది. ఇక, మేనిఫెస్టోలో కీలక అంశాలను దృష్టిలో పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇక, తెలంగాణలో సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని ఇప్పటికే రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి తెలిపారు. అలాగే.. విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని కాషాయ పార్టీ చెబుతోంది. మేనిఫెస్టోలో జాబ్ క్యాలెండర్, ఉపాధి అవకాశాలపై హామీలు ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో పలు నగరాల పేర్లు మారుస్తామని మేనిఫెస్టోలో బీజేపీ పొందుపర్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు నవంబర్ 23వ తేదీతో ముగియనున్నాయి. ఆ తర్వాత బీజేపీ జాతీయ నేతలంతా తెలంగాణలో మకాం వేయనున్నట్లు స్థానిక నేతలు చెబుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే తెలంగాణను చుట్టేశారు. మరోసారి.. నవంబర్ 25, 26, 27 తేదీల్లో వస్తారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ప్రచారానికి చివరి వారం కీలకంగా మారనుంది. అలాగే, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల పార్టీ ముఖ్య నేతల తాకిడి రాష్ట్రానికి పెరుగుతుందని రాష్ట్ర బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు.. తెలంగాణలో కీలక నేతలు పార్టీలు మారుతున్నారు. తాము ఆశించిన టికెట్లు రాకపోవడంతో ఇతర పార్టీలవైపు చూస్తున్నారు. తాజాగా బీజేపీ నేత తుల ఉమ కాషాయ పార్టీకి రాజీనామా చేశారు. వేములవాడ టికెట్ తనకు ఇవ్వకపోవడంతో ఆమె బీజేపీని వీడారు. ఇక, సొంత పార్టీ అయిన బీఆర్ఎస్‌లోకి తుల ఉమ వెళ్తున్నారు.



## వలస పెత్తనం వద్దే వద్దు!

**దొర దోపిడీ పాలనను ఇక భరించలేం..**

**పాలకుర్తి రాజకీయాల్లో పెను మార్పులు**

**'ఎర్రబెల్లి'పై పెరుగుతోన్న వ్యతిరేకత**

**అనూహ్యంగా లోకల్ కార్డు తెరమీదకు**

**సొంత గడ్డ అభ్యర్థి వైపే స్థానికుల మొగ్గు**

**20 ఏండ్ల పెత్తనానికి శుభం కార్డు..**

### ఈసారి లోకల్ వ్యక్తికే ఛాన్స్..!

పాలకుర్తి ఎన్నికల్లో మొదటిసారి లోకల్, నాన్ లోకల్ అంశంపై తీవ్ర చర్చ నడుస్తోంది. నాన్ లోకల్ వ్యక్తి అయినా ఎర్రబెల్లి దయాకర్ రావును మూడు సార్లు గెలిపించామని, కానీ ఈసారి మాత్రం స్థానిక అభ్యర్థినే గెలిపిస్తామని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నాన్ లోకల్ అయిన ఎర్రబెల్లి దయాకర్ రావును కాదని లోకల్ అభ్యర్థుల వైపే స్థానికులు మొగ్గు చూపుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధాన పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో చాలా మంది నాన్ లోకల్ వాళ్లే ఉన్నారు. ఇక ఇండిపెండెట్, చిన్న పార్టీల నుంచి పోటీ చేస్తున్న వారిలో చాలా మంది లోకల్ వాళ్లు ఉన్నారు. అయితే వారందరిలో దయాకర్ రావును ఓడించే సత్తా కాంగ్రెస్ అభ్యర్థి ఝూన్సీ యశస్వినిరెడ్డికే ఉందని స్థానికులు అనుకుంటున్నారు. ఇక యశస్వినిరెడ్డి నామినేషన్ కూడా ఓకే కావడంతో పాలకుర్తి ప్రజలు యశస్వినిరెడ్డికి పెద్ద ఎత్తున మద్దతు పలుకుతూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. యశస్వినిరెడ్డి అభ్యర్థిత్వం ఓకే కావడంతో ఎర్రబెల్లి దయాకర్ రావు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని కాంగ్రెస పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక ఈ ఎన్నికల్లో యశస్వినిరెడ్డి గెలిస్తే 20 ఏళ్ల నాన్ లోకల్ పాలనకు ఫుల్ స్టాప్ పడ్డట్లేనని ఇక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు.

**విశాల భారతి, పాలకుర్తి:**

పాలకుర్తి రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సడెన్ గా లోకల్, నాన్ లోకల్ కార్డు తెరమీదకు వచ్చింది. నియోజకవర్గవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇక వలస పెత్తనం చాలు అనే మాటలు వినిపిస్తున్నాయి. దీంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అదే సమయంలో స్థానికురాలు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యశస్వినిరెడ్డి వైపు స్థానికులు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటిదాక ఎర్రబెల్లి వెంట నడిచిన నాయకులు ఒక్కొక్కరుగా 'హస్తం' గూటికి చేరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి సమక్షంలో వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటున్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నుంచి వరుసగా మూడు సార్లు గెలిచి 15 ఏళ్ల నుంచి అధికారంలో ఉండగా.. అంతకు ముందు దుగ్యాల శ్రీనివాస్ రావు (నాటి చెన్నూరు) ఎమ్మెల్యేగా ఐదేళ్లపాటు కొనసాగారు. ఇలా వరుసగా 20 ఏళ్ల పాటు నాన్ లోకల్ వ్యక్తుల పెత్తనం కిందే మగ్గుతున్నామని, స్థానికేతరుల సేవలు ఇక చాలు అని ఇక్కడి ప్రజలు అనుకుంటున్నారు.

**లోకల్ వ్యక్తిని కాదని మూడు సార్లు గెలిపిస్తే..**

వడ్డించేవాడు మనోడైతే బంతిలో చివరన కూర్చున్న ఫుల్ మీల్స్ దొరుకుందంటారు. మరి వడ్డించేవాడే పరాయి వాడైతే.. ఇక ఎక్కడ కూర్చున్న పెద్దగా ప్రయోజనం ఉండదని పాలకుర్తి ప్రజలు అనుకుంటున్నారు. పాలకుర్తిలో ఇప్పుడు ఇదే జరుగుతోందనే టాక్ వినిపిస్తోంది. ప్రజల్లో మంచి పేరుంది.. అభివృద్ధి చేస్తాడని భావించి లోకల్ అభ్యర్థిని కాదని ఇక్కడి ప్రజలు ఎర్రబెల్లి దయాకర్ రావును మూడుసార్లు గెలిపించారు. 2009లో పాలకుర్తిలో అడుగుపెట్టిన ఎర్రబెల్లి.. టీడీపీ నాయకుడు డాక్టర్ ఎన్.సుధాకర్ రావు (లోకల్)ను రేసులో నుంచి తప్పించి ఆ పార్టీ టికెట్ తెచ్చుకున్నారు. ఇక అప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న దుగ్యాల శ్రీనివాస్ రావు (నాన్ లోకల్)తో తలపడ్డ ఎర్రబెల్లి దయాకర్ రావు మొదటిసారి పాలకుర్తి ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎర్రబెల్లి దయాకర్ రావు(టీడీపీ), దుగ్యాల శ్రీనివాస్ రావు(కాంగ్రెస్), బీఆర్ఎస్ నుంచి డాక్టర్ ఎన్.సుధాకర్ రావు (లోకల్) ఇక్కడ పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో జంగా రాఘవరెడ్డితో పాటు లోకల్ వ్యక్తైన సుధాకర్ రావు స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2018లో బీఆర్ఎస్ నుంచి ఎర్రబెల్లి దయాక్ రావు, కాంగ్రెస్ నుంచి జంగా రాఘవరెడ్డి పోటీపడ్డారు. ఇద్దరు నాన్ లోకల్ అభ్యర్థులే కావడం, పైన బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తోందని ప్రచారం జరగడంతో స్థానిక ప్రజలు మళ్లీ ఎర్రబెల్లికే పట్టం కట్టారు. ఆ ఎన్నికల్లో గెలిచిన ఎర్రబెల్లి మంత్రి కూడా అయ్యారు. కానీ నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి ఆయన పెద్దగా చేసిందేమీ లేదని స్థానికులు భావిస్తున్నారు.

**పెత్తనమంతా వాళ్లదే..!**

ఎర్రబెల్లి దయాకర్ రావు చుట్టూ ఉండే వ్యక్తుల్లో చాలామంది నాన్ లోకల్ వాళ్లే. పీఏల నుంచి ముఖ్య సలహాదారుల వరకు చాలామంది స్థానికేతరులే. మంత్రిని కలవాలన్నా, ఏమైనా పనులు చేయించుకోవాలన్నా ముందు వాళ్లను దాటాల్సిందే. వార్డు మెంబర్ మొదలుకొని జెడ్పీటీసీ వరకు స్థానిక ప్రజాప్రతినిధులెవరైనా సరే మంత్రిని కలవాలంటే ముందు వాళ్లను కలవాలి. ఒక్కరో ఇద్దరో స్థానిక నేతలకు డైరెక్ట్ గా మంత్రితో మాట్లాడే చనువు ఉన్నప్పటికీ చాలా వరకు మాత్రం ఆయన చుట్టూ ఉండే నాన్ లోకల్ వాళ్లదే పెత్తనం. దీంతో తమకు ఏమాత్రం విలువలేదని స్థానిక ప్రజాప్రతినిధులు లోలోపల మదనపడుతున్నారు. ప్రతి చిన్నపనికి వాళ్ల పర్మిషన్ తీసుకోవాల్సి వస్తోందని, ఇది తమకు చాలా అవమానకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రభుత్వానికి సంబంధించి కాంట్రాక్ట్ పనులేమైనా ఉంటే ఇక్కడి నాయకులకు రావడం చాలా కష్టమని వారు వాపోతున్నారు. ఇక నాయకుల పరిస్థితే ఇలా ఉంటే సామాన్య కార్యకర్తలు, ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. ఈ క్రమంలోనే తమపై వాళ్ల పెత్తనం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. మొదట రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దయాకర్ రావు దగ్గరికి వెళ్లాలంటే సామాన్య ప్రజలకు కూడా ఈజీ యాక్సెస్ ఉండేదని, కానీ మంత్రి అయ్యాక అలాంటి పరిస్థితి లేదని వారు అంటున్నారు.

## హస్తం అధోగతి

**పట్నంలో కాంగ్రెస్ ఎదురీత**


**కాంగ్రెస్ అభ్యర్థి సోదరులపై తీవ్ర ఆరోపణలు**

**బీఆర్ఎస్ శ్రేణులపై రాళ్లదాడి ఎఫెక్ట్**

**కాంగ్రెస్ జెండా మోసేందుకు వెనుకాడుతున్న కార్యకర్తలు**

**'ఎం'ట్యాక్స్ పేరుతో అప్పుడే వసూళ్లు షురూ**





### "ఎం' ట్యాక్స్ పేరుతో వసూళ్లు'

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో అధికారంలో ఉన్న నేపథ్యంలో ఇప్పటికే 'ఎం'ట్యాక్స్ పేరుతో వసూళ్లకు తెగబడినట్లు తెలుస్తోంది. దళిత కౌన్సిలర్‌ను అడ్డుపెట్టుకొని ఓ బిల్డర్స్ దగ్గర భారీ మొత్తంలో గుంజాలని చూశారట. ఎనిమిది ఇళ్లు నిర్మిస్తున్న ఆ బిల్డర్ దగ్గరకు కౌన్సిలర్ వెళ్లి ఇంటికి రూ.లక్ష చొప్పన రూ.8లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారట. అయితే అన్ని అనుమతులు సవ్యంగా ఉన్నాయని డబ్బులు ఇచ్చేందుకు ఆ బిల్డర్ నిరాకరించారట. అనుమతులన్నీ ఉన్నా ఇంటి పర్మిషన్ తన ద్వారా తీసుకోలేదని, వేరొకరి ద్వారా తీసుకున్నందుకు తమకు ఎంతోకొంత ఇచ్చి తీరాల్సిందేనని పట్టుబట్టి వసూలు చేశారట. అలాగే అదే వార్డులో సాగర్‌రోడ్డుకు ఆనుకొని ఓ కమర్షియల్ బిల్డింగ్ నిర్మిస్తున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా, రహదారికి ఆనుకొని నిర్మిస్తున్న ఈ బహుళ అంతస్థుల భవన యజమాని దగ్గర ఎం ట్యాక్స్ పేరు చెప్పి ఆ దళిత కౌన్సిలర్ భారీగా గుంజారట. చైర్ పర్సనే తన చేతిలో ఉన్నారని, ఎవరు అడ్డుపడకుండా అంతా చూసుకుంటానని యజమానికి మాటిచ్చారట ఆ కౌన్సిలర్ భర్త. ఇలా ఇప్పుడే వసూళ్లకు తెగబడుతున్న కాంగ్రెస్ నేతలు... రేపు అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏంటనే ఆలోచనలో పడ్డారు ప్రజలు.

**రంగారెడ్డి బ్యూరో, విశాలభారతి:**

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉంది అన్నట్లు ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి తయారైంది. నియోజకవర్గ వ్యాప్తంగా బలమైన క్యాడర్ ఉన్నా నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో హస్తం పార్టీకి ఇక్కడ విజయం దక్కడం లేదు. దీనికి తోడు పట్నం కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా భావిస్తున్న మల్‌రెడ్డి బదర్స్‌పై ఆరోపణలు ఆ పార్టీ విజయానికి చేటు చేయడమే కాకుండా, పార్టీ మనుగడనూ ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఆ సోదరుల దుందుడుకు స్వభావం నేతల్లో, కార్యకర్తల్లో అసహనం తీసుకొస్తూ పార్టీ జెండాను మోయడానికి తటపటాయిస్తున్నారన్న టాక్ ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా అనుకూల పవనాలున్నాయని సర్వేలు చెబుతుంటే.... ఇబ్రహీంపట్నంలో మాత్రం అందుకు విరుద్ధంగా మారడానికి కారణాలేంటి? జనాలు కాంగ్రెస్ వెంట నడిచేందుకు ఎందుకు జంకుతున్నారు?.

**'నేతలెందుకు కలిసి రావడంలేదు'**

యాచారం మండలంలో సుమారు 20వేల ఎకరాల్లో తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా ఫార్మాసిటీని నెలకొల్పుతోంది. రైతుల నుంచి భూమి సేకరించి ఈ ప్రాజెక్టును చేపట్టింది ప్రభుత్వం. కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి వంటి గ్రామాల్లో అనేక మంది రైతుల భూములు ఫార్మాసిటీలో కోల్పోతున్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసులు వేసి పోరాడుతున్నారు అక్కడి ప్రజలు. దాదాపు ఐదేళ్ల నుంచి ఉద్యమం కొనసాగుతూనే ఉంది. బీఆర్ఎస్ సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. ఈ పోరాటానికి అన్ని పార్టీలు మద్దతిచ్చినా... కాంగ్రెస్ నేతలు మాత్రం అటువైపు మళ్లీ చూడలేదు. పోలేదనకుండా ఒకట్రెండు సభల్లో హస్తం పార్టీ నేతలు పాల్గొని చేతులు దులుపుకొన్నారన్న వాదనలున్నాయి. ఈ ఉద్యమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొనకపోవడం వెనుక పెద్ద స్కెచ్చే ఉందంటున్నారు విశ్లేషకులు. బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పెద్దలు లాలూచీపడ్డారని, డబ్బులు దండుకొని తమకు మద్దతు ఇవ్వడంలేదని ఆ ప్రజలు వాపోతున్నారు. సహజంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండాల్సిన ఆ గ్రామాల ప్రజలు... కాంగ్రెస్‌పై మండిపడుతున్నారు. దీంతో కార్యకర్తలు, ప్రజలు కాంగ్రెస్ వెంట నడిచేందుకు వెనుకాడుతున్నారు.

**'గొడవలకూ తెరలేపే కుట్ర'**

సుమారుగా 15ఏళ్ల నుంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రశాంతంగా ఉంది. ఎలాంటి గొడవలు లేకుండా సాఫీగా ముందుకెళ్తోంది. కాంగ్రెస్ వస్తే అరాచకాలు మొదలవుతాయన్న వాదనలకు నామినేషన్ల రోజు జరిగిన ఘటన ఉదాహరణగా భావిస్తున్నారు విశ్లేషకులు. ఆ ఘటనలో కాంగ్రెస్‌కు ఎంత లాభం వచ్చిందో తెలియదు కానీ... నష్టం మాత్రం భారీగానే మూటగట్టుకున్నారని అంటున్నారు ప్రజలు. బీఆర్ఎస్ ర్యాలీ కూడా ఉందని తెలిసి, ముందే కుట్ర పన్ని నామినేషన్‌కు లేటుగా బయల్దేరారని, అనుకున్న విధంగా బీఆర్ఎస్ శ్రేణులపై ముందుగా కాంగ్రెస్ కార్యకర్తలే చెప్పులు విసిరారని విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో బీఆర్ఎస్‌కు చెందిన కార్యకర్తలే ఎక్కువగా గాయపడటంతో ఈ వాదనలకు మరింత బలం చేకూరింది. రాళ్లు విసురుతున్న వ్యక్తులు కాంగ్రెస్ కండువా కప్పుకొని ఉండటం కూడా ఫొటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నదంటున్నారు స్థానికులు. అయితే బీఆర్ఎస్‌పై దుమ్మెత్తి పోసే ప్రయత్నంలో కాంగ్రెస్ నాయకులే చేతులు కాల్చుకున్నారని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

**'మోసాలూ వెన్నతో పెట్టిన విద్యే'**

ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ నేతలకు మోసాలు చేయడం వెన్నతోపెట్టిన విద్య అనే అంటున్నారు విశ్లేషకులు. తుర్కయంజాల్ మున్సిపాలిటీపై ఎలాగైనా పాగా వేయాలన్న ఉద్దేశంతో ఇక్కడ బలమైన నేతగా ఉన్న రొక్కం భీంరెడ్డికి ఇష్టం లేకున్నా అప్పట్లో కండువా కప్పారు. భీం రెడ్డి బలగం, బలంతో తిరుగులేని మెజార్టీతో కాంగ్రెస్‌కు విజయం దక్కింది. మల్‌రెడ్డిరొక్కం కుటుంబాలకు చెరో రెండున్నరేళ్ల చొప్పున చైర్మన్ పదవి అంటూ స్వయానా ఎంపీ సమక్షంలో ఒప్పంద పత్రాలు రాసుకున్నారు. మొదట మల్‌రెడ్డి కుటుంబం నుంచి చైర్మన్ పీఠం దక్కించుకున్నారు. రెండున్నరేళ్లు, మూడేళ్లు, మూడున్నరేళ్లు దాటినా రొక్కం కుటుంబానికి చైర్మన్ పదవి ఇచ్చేందుకు మల్‌రెడ్డి సోదరులు సుముఖత చూపలేదు. తమ కుటుంబానికి ఉన్న ఒకే ఒక పదవి పోగొట్టుకోవాలా? ఇచ్చిన మాట ప్రకారం రొక్కం కుటుంబానికి ఇవ్వాలా అనే ఆలోచన చేశారు. చైర్మన్ పదవివైపే మొగ్గు చూపి, రొక్కం కుటుంబానికి హ్యాండిచ్చారు కాంగ్రెస్ నేతలు. దీంతో ఆగ్రహించిన రొక్కం భీంరెడ్డి తన అనుచర కౌన్సిలర్లతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిపోయారు. ఆదిభట్ల మున్సిపాలిటీలోనూ ఇదే సీను ఉన్నా... అక్కడి నేత తాజాగా మల్‌రెడ్డితో చేయి కలిపి ముందుకు నడుస్తున్నారు. వీటన్నంటినీ గమనిస్తున్న ప్రజలు కాంగ్రెస్‌కు ఎలా ఓటేస్తారని, మోసాల్లో వారు ఆరితేరారని అంటున్నారు విశ్లేషకులు.

**'బీసీ నినాదం ఏమైంది?'**

ఇబ్రహీంపట్నం టికెట్‌ను బీసీలకు ఇవ్వాలని కొన్నాళ్లు ఆ పార్టీలో కొందరు నేతలు హల్‌చల్ చేశారు. మల్‌రెడ్డి బ్రదర్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు. పట్నం కాంగ్రెస్ టికెట్ బీసీలకే ఇవ్వాలని అధిష్ఠానం వద్ద అప్లికేషన్లు పెట్టారు. తీరా చూస్తే మళ్లీ ఆ అగ్రకుల నేతల దగ్గరే సాగిల పడ్డారని విమర్శలు గుప్పిస్తున్నారు బీసీ నాయకులు. నియోజకవర్గంలో 60శాతం ఉన్న బీసీలకు ప్రతినిధులుగా ఉండాల్సిన ఆ నాయకులు... మళ్లీ అగ్రకుల నాయకుల పంచన చేరడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని... ఈ సారి అవకాశవాద నాయకులకు బుద్ధి చెప్తామని అంటున్నారు ప్రజలు. మల్‌రెడ్డి ఇంటికి బీసీ, ఎస్సీ నాయకులు వెళ్తే కనీసం కూర్చోమని మర్యాద ఇవ్వరని, వారి ఎదుట చేతుల కట్టుకొని నిలబడి మాట్లాడాల్సిందేనని ఎప్పటి నుంచో ఓ వాదన ఉంది. అలాంటివారి దగ్గర బీసీ నాయకులు మోకరిల్లడం, మళ్లీ వారికే మద్దతివ్వడం ఏంటనే ప్రశ్న ప్రజల్లో నుంచి వస్తోంది. ఈ కారణంగా కొందరు బీసీలు తాజాగా కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్, ఇతర పార్టీల్లో చేరినట్లు తెలుస్తోంది.

**'అక్రమాలకూ తెరలేపారా?'**

ఇబ్రహీంపట్నంలో ఒకవేళ కాంగ్రెస్ గెలిస్తే వసూళ్లకు తెరలేపుతారని, తోపుడు బండ్ల దగ్గర నుంచి, పెంట్ హౌస్‌ల దాకా ఎగబడి వసూలు చేస్తారని ఎన్నాళ్ల నుంచో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు నిజమయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయంటున్నారు విశ్లేషకులు. పిల్ల పుట్టకుండానే కుళ్ల కుట్టించారన్న చందంగా... నియోజకవర్గంలో అధికారంలోకి రాకముందే స్వకార్యాల కోసం అన్నీ సిద్ధం చేసుకుంటున్నారని టాక్. అక్రమ వసూళ్లే లక్ష్యంగా నాలుగు భాగాలుగా ఆల్రెడీ విభజించుకున్నారట పట్నం హస్తం పార్టీ పెద్దలు. నియోజకవర్గ కేంద్రం పెద్దాయనకు, తుర్కయంజాల్ తమ్ముడికి, తొర్రూరు మేనల్లుడికి, మంచాల కుమారుడికి అనే విధంగా ఈ విభజన జరిగిందట.